క్లుప్తంగా

కేంద్ర మంత్రి 'బండి'ని కలిసిన నాయకులు



మంత్రి సంజయ్‌ని కలిసిన నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు

తిమ్మాపూర్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, కోమల ఆంజనేయులు సోమవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్‌తోపాటు రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, నాయకులు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, ఏలేటి స్వప్న, చంద్రారెడ్డి, అన్నాడి రాజిరెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, వెంకట సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఐటీ విద్యార్థికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్‌కు చెందిన గొర్రె అంజన్‌కుమార్ కేరళ ఎన్‌ఐటీలో సెకండియర్ చదువుతున్నాడు. ఫీజు చెల్లించే స్థోమత లేకపోవడంతో స్థానికులు విషయాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సోమవారం తన క్యాంపు కార్యాలయంలో విద్యార్థికి సొంత డబ్బులు రూ.50 వేల చెక్కు అందించారు.

'భగీరథ' నీరు.. రెండేళ్లుగా వృథా



వృథాగా పోతున్న నీరు

చిగురుమామిడి: మండల వ్యవసాయాధికారి కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నల్లా నుంచి నీరు రెండేళ్లుగా వృథాగా పోతోంది. రైతు వేదికలు ఏర్పాటు చేసినప్పటి నుంచి వ్యవసాయశాఖ అధికారులు ఈ ఆఫీస్‌కు రావడం లేదు. నల్లా నీరు 24 గంటలు పోతూనే ఉంటుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా దానికి బిరడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత ఏఈ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నికలను సోమవారం స్థానిక కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. అధ్యక్షుడిగా దాసరి సాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వర్ల సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తాడికొండ సంపత్‌రెడ్డి, కోశాధికారిగా చాడ అనిల్‌రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రొంటాల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అలాగే, కార్యవర్గ సభ్యులుగా పరిపాటి రవీందర్‌రెడ్డి, కేతిరెడ్డి కొండల్‌రెడ్డి, దాసరి వెంకట్‌రెడ్డి, కాంతాల మాధవరెడ్డి, పారంధ్ల సంపత్‌రెడ్డితోపాటు మరో ఆరుగురు ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

చొప్పదండి: పట్టణంలోని లయన్స్ భవన్‌లో చొప్పదండి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం నిర్వహించారు. ఇన్‌స్టాలేషన్ అధికారిగా 320 జీ జిల్లా ఉప గవర్నర్ కోదండరాం వ్యవహరించారు. అధ్యక్షుడిగా మహేశుని మల్లేశం, కార్యదర్శిగా రాజేశ్ పవార్, కోశాధికారిగా తొడుపునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా వల్లాల జగన్ ప్రమాణస్వీకారం చేశారు. కొల్లూరి జితేందర్, దూస రాము, కొల్లూరి ఆనందం, మోర భద్రేశం, ఆనంద్, బాబు, రాజేందర్, శ్రీనివాస్, విలాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీలో.. సమస్యలెన్నో



సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల



గాలికి లేచిన తరగతి గదుల పైకప్పు

- సైదాపూర్ జూనియర్ కళాశాలలో గదుల కొరత
- రెండింటికి పైకప్పు లేదు
- కొన్నింటికి తలుపులు, కిటికీలు లేవు
- కాలేజీకి ప్రహరీ, ఆటస్థలం, సరిపడా ఫర్నిచర్ లేదు
- క్లాస్‌రూంలలోనే ల్యాబ్ నిర్వహణ
- రాత్రివేళల్లో మందుబాబులకు అడ్డా
- అడ్మిషన్‌కు ఆసక్తి చూపని విద్యార్థులు

సైదాపూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనపై పాలకులు, అధికారులకు పట్టింపు కరువైంది. కాలేజీని ఎన్నో సమస్యలు వెంటాడుతున్నా పట్టించుకునేవారు లేకపోవడంతో పరిష్కారానికి నోచుకోవడం లేదు. తరగతి గదుల పైకప్పు రేకులు గాలికి లేచి, ఏళ్లు గడుస్తోంది. గదుల కొరత ఉంది. ఉన్నవాటికి తలుపుల్లేవు. ల్యాబ్‌కు గది లేకపోవడంతో తరగతి గదుల్లోనే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. కాలేజీకి ప్రహరీ లేక హరితహారం మొక్కలను పశువులు తింటున్నాయి. తలుపులు, కిటికీలు లేని తరగతి గదులు రాత్రివేళ మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

గుట్ట ప్రాంతంలో ఏర్పాటు..

సైదాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం దొరక్కపోవడంతో సమ్మక్క–సారలమ్మ గుట్ట ప్రాంతంలో కాలేజీ ఏర్పాటు చేశారు. విశాఖ ట్రస్టు ద్వారా నిర్మించిన రెండు గదులకు కిటికీలు, తలుపులు లేవు. కాలేజీ మైదానంలో పెద్ద, పెద్ద బండలున్నాయి. భూమి సమానంగా లేదు. విద్యార్థుల ఆటలకు అనువైన స్థలం లేదు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల తరగతులు నిర్వహిస్తున్నారు. సరిపడా తరగతి గదులు లేవని, పక్కా భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని, పాలకులను, అధికారులను పలుమార్లు కోరినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ప్రిన్సిపాల్ సత్యనారాంజనేయులు తెలిపారు.

రవాణా సౌకర్యం లేదు

ఈ కళాశాలకు సైదాపూర్ మండలంలోని 26 గ్రామాల నుంచి విద్యార్థులు రావడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ, సరైన రవాణా సౌకర్యం లేదు. అమ్మనగుర్తి, గుండ్లపల్లి, నల్లరామయ్యపల్లి, బొమ్మకల్, రాయికల్, గొడిశాల, గుజ్జులపల్లి, ఎల్లంపల్లి, రాములపల్లి, వెన్నంపల్లి, ఎగ్లాస్‌పూర్ గ్రామాల విద్యార్థులకు బస్సు లేదు. 10 కిలోమీటర్ల దూరం సైకిల్‌పై వచ్చి, నీరసంతో పాఠాలు వినలేకపోతున్నారు. కనీస వసతులు లేకపోవడంతో కొత్తగా విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మంత్రి 'పొన్నం' స్పందించాలి



విద్యార్థులకు తరగతి గదులు సరిపోవడం లేదు. రెండు గదుల రేకుల షెడ్డు పైకప్పు గాలికి లేచి, ఏళ్లు గడుస్తోంది. తిరిగి ఏర్పాటు చేయడం లేదు. ల్యాబ్‌కు గది లేదు. సరిపోయేంత ఫర్నిచర్ లేదు. తరగతి గదుల తలుపులు ఊడిపోయాయి. రాత్రివేళల్లో మందుబాబులు మద్యం సేవించి, సీసాలు పడేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి, వసతులు కల్పించాలి.

– సత్యనారాంజనేయులు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ

తెలంగాణ.. కళలకు పుట్టినిల్లు

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



గోపాల్‌రావుకు అవార్డు అందిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: తెలంగాణ కళలకు పుట్టినిల్లు అని, హుజూరాబాద్ నియోజకవర్గంలో నాట్య రంగానికి ప్రాణం పోసేలా తపస్వి నాట్య మండలి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో తపస్వి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గోవింద నామ సహస్ర మహిళా కోలాట బృందం సభ్యులు 1008 మంది ప్రదర్శన ఇచ్చారు. ఇది గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత, సహస్ర మహోత్సవ సామ్రాట్ శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి వారి గ్లోబల్ డివోషనల్ అవార్డు సాధించింది. ఈ సందర్భంగా నాట్య మండలి నిర్వాహకురాలు చిలమకూరి శ్వేతను ఎమ్మెల్యే అభినందించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తానని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ విష్ణుదాస్ గోపాల్‌రావుకు గ్లోబల్ డివోషనల్ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవానికి రండి

- 25లోగా పాటలను పంపండి.. ముద్రిస్తాం
- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

జమ్మికుంట: మాదిగల చైతన్యం, ఏబీసీడీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి, 30 ఏళ్లవుతున్న సందర్భంగా జూలై 7న వరంగల్‌లో నిర్వహించే వేడుకలకు తరలివచ్చి, విజయవంతం చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం జమ్మికుంట పట్టణంలో సీనియర్ కళాకారుడు రామంచ భరత్ అధ్యక్షతన వివిధ ప్రాంతాల కవులు, కళాకారులు, నాయకులతో ఆవిర్భావ దినోత్సవంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మాదిగల ఆత్మగౌరవం కోసం పార్టీలకతీతంగా మాదిగలు, మాదిగ ఉపకులాలవారు రావాలని కోరారు. ఏబీసీడీ వర్గీకరణ అంశంలో మంద కృష్ణ మాదిగ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని పోరాట పాటలను పుస్తక రూపంలో తీసుకురాబోతున్నామని తెలిపారు. ఈ నెల 25లోగా పంపించాలన్నారు. ముద్రణకు తన వంతుగా సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా విద్యార్థి సంఘం నాయకుడు నలిగంటి శరత్, సీనియర్ కవులు, కళాకారులు ముక్కెర సంపత్‌కుమార్, డాక్టర్ కట్కూరి మహేందర్, అశోక్ మోరు, గిద్దె రాంనర్సయ్య, అంబాల మధునయ్య, గోల్కొండ బుచ్చన్న, పుల్లూరు సమ్మయ్య, జూపాక శివ, కన్నూరి అనంద్, కేతపాక ప్రసాద్, ఇమ్మడి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పొన్నం'పై నిరాధార ఆరోపణలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: మంత్రిగా పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేస్తున్నవి నిరాధార ఆరోపణలని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి, పొనగంటి మల్లయ్య, గూడెం సారంగపాణి, ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, నేరెళ్ల మహేందర్ తెలిపారు. సోమవారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలు తెలియకుండా గవర్నర్‌ను మొదలుకొని అందరినీ కించపరిచి మాట్లాడటం మంచిది కాదన్నారు. అపరిపక్వత, అనుభవం లేని చిన్నపిల్లల మనస్తత్వం కలిగిన వ్యక్తిలా ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బూడిద తొలగించాలనే కేంద్రం విధానంపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని, మంత్రిని బద్నాం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉప ఎన్నికల తర్వాత మానేరు ఇసుక మాఫియా నడిపించలేదా, ఉద్యోగాలు పెట్టిస్తానని డబ్బులు తీసుకోలేదా అని ప్రశ్నించారు. ఇకపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. ఎన్నికల్లో గెలిపించకపోతే తన శవయాత్రకు రావాలంటూ ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసి, గెలిచాడన్నారు. దుర్మార్గమైన ఆలోచనలు మానుకొని, ప్రజల కోసం పని చేయాలని హితవు పలికారు. కౌన్సిలర్లు బొంగోని వీరన్న, దిడ్డి రాము, శ్రీపతి నరేశ్, నాయకులు మొలుగూరి సదయ్య, దొగ్గల భాస్కర్, రమేశ్ తదితరులున్నారు.

'ప్రజాపాలన అర్జీలను ఆన్‌లైన్ చేయలే'

చిగురుమామిడి: ముదిమానిక్యం గ్రామానికి చెందిన దాదాపు 100 కుటుంబాలకు సంబంధించిన ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్ చేయలేదని, ఫలితంగా వారికి గృహజ్యోతి పథకం వర్తించడం లేదని బీజేపీ నాయకుడు పోలోజు సంతోష్ ఆరోపించారు. సోమవారం చిగురుమామిడిలో ఆయన మాట్లాడారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ వర్తించక పేదలు 3 నెలలుగా కరెంటు బిల్లు చెల్లిస్తున్నారని తెలిపారు. అధికారులు సర్వే చేసి, అర్హులకు గృహజ్యోతి పథకం వర్తింపజేయాలన్నారు. మిగిలిన పథకాల అర్జీలను కూడా ఆన్‌లైన్ చేయలేదని, ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతుల్లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని హుజూరాబాద్ సింగిల్‌విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి కోరారు. సోమవారం హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొందరు చిన్న, సన్నకారు రైతులు కూడా ఆదాయపన్ను చెల్లిస్తున్నారని, ఇంకొందరిది రేషన్ కార్డు లేదని తెలిపారు. రుణమాఫీ వర్తించడం లేదని వారు దిగులు చెందుతున్నారని అన్నారు. 2018 డిసెంబర్ 12 నుంచి తీసుకున్న రుణాలను మాఫీ చేస్తూనే తిరిగి కొత్త రుణాలను అందించాలని పేర్కొన్నారు. అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మానకొండూర్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు కరీంనగర్ వైపు నుంచి వరంగల్ వైపు వెళ్తోంది. అదే సమయంలో కారు వరంగల్ వైపు నుంచి వస్తోంది. మానకొండూర్ మండలం చెంజర్ల, ఈదులగట్టపల్లి శివారులో బస్సును ఢీకొట్టింది. కారులో ఉన్న నలుగురిలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇదే కారును వెనకాల వస్తున్న ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టగా అతను కూడా గాయపడ్డాడు. బాధితులను 108 వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

పెద్దూర్‌పల్లి శివారులో ఇద్దరికి..

ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి నుంచి చెంజర్ల వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం, చెంజర్ల వైపు నుంచి మన్నెంపల్లి వైపు వెళ్తున్న ఆటో పెద్దూర్‌పల్లి శివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు వీరిని 108 వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



బిజిగిరిషరీఫ్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చొప్పదండిలో..

జమ్మికుంట: పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సామూహిక నమాజ్, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపజేయడమే బక్రీద్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గుల్జర్ మసీదు కమిటీ అధ్యక్షుడు ఎం.ఏ.హుస్సేన్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు దయ్యాల శ్రీనివాస్, గాజుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బిజిగిరిషరీఫ్ దర్గాలో..

జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గా, గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మత గురువు మౌలానా నౌమన్ హస్మీ ఖురాన్‌లోని సూక్తులను చదివి వినిపించారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ కరీం, కార్యనిర్వాహక అధ్యక్షుడు మహమ్మద్ తౌఫిక్ హుస్సేన్, కార్యదర్శి మహమ్మద్ జమాల్ అష్రఫ్, సంయుక్త కార్యదర్శి నైముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని ఈద్గాలో ముస్లింలు నమాజ్ చేశారు. అనంతరం అందరూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. బక్రీద్ ప్రాముఖ్యతను ముస్లిం మత గురువు వివరించారు. వేడుకలకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై, ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

చొప్పదండి: పట్టణంలోని ఈద్గా మైదానంలో సోమవారం బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. సామూహిక ప్రార్థనలు చేశారు.

రామడుగు: మండలంలో సోమవారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రామడుగు, వెదిర, వెలిచాల, దేశరాజ్‌పల్లి, తిర్మలాపూర్, గుండి గ్రామాల్లోని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం, మొలంగూర్, తాడికల్, కరీంపేట, అంబాల్‌పూర్ గ్రామాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



రామడుగులో..



కేశవపట్నంలో..

బీసీల హక్కుల సాధనకు పోరాడాలి



మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

హుజూరాబాద్: బీసీల హక్కుల సాధనకై అలుపెరగకుండా పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, బీసీ రాజకీయ పోరాట సమితి అసెంబ్లీ అధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటాలకైనా సిద్ధమని పేర్కొన్నారు. 77 ఏళ్లుగా బీసీలకు సరైన గుర్తింపు, రాజ్యాధికారం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. వారిని ఓటు బ్యాంకుగా చూసే విధానం పోవాలన్నారు. అనంతరం ఆయనను బీసీ సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. బీసీ రాజకీయ పోరాట సమితి అసెంబ్లీ ప్రధాన కార్యదర్శిగా కూరపాటి రామచంద్రం, మండల ప్రధాన కార్యదర్శిగా కోమటి శ్రీనివాస్‌లను నియమించారు. కార్యక్రమంలో బీసీ రాజకీయ పోరాట సమితి మండల అధ్యక్షుడు పంజాల తిరుపతి గౌడ్, వీణవంక మండల అధ్యక్షుడు వడ్డేపల్లి రాజగోపాల్, యువజన విభాగం రాష్ట్ర నాయకుడు బోయినపల్లి సాయిచంద్, బీసీ నాయకులు సంగెం సత్యనారాయణ, శ్రవణ్, సాయి, వీరబోయిన వేణు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో 'నల్లగొండ' పూర్వ అర్చకుడి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

తిమ్మాపూర్: నల్లగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పూర్వ అర్చకుడు పెరంబుదిరి వెంకటేశ్వర్లు (65) సోమవారం గుండెపోటుతో మృతిచెందారని గ్రామస్తులు తెలిపారు. ఉదయం గ్రామంలో కొన్ని కార్యక్రమాలు నిర్వహించి, ఇంటికి చేరుకున్నాడన్నారు. స్నానం చేసి, మరో కార్యక్రమానికి బయలుదేరుతుండగా గుండెనొప్పి వచ్చి, కుప్పకూలిపోయాడని పేర్కొన్నారు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడన్నారు. వెంకటేశ్వర్లు 35 ఏళ్లు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా పని చేశారు. ఇటీవలే ఆయన కుమారుడు నరేశ్ అనారోగ్యంతో చనిపోయాడు. ఏడాదిలోపే తండ్రీకొడుకు మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

'హంతకుడిని ఉరి తీయాలి'

చొప్పదండి: పెద్దపెల్లి జిల్లాలో వలస కార్మికుల కుటుంబానికి చెందిన ఆరేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడి, చంపేసిన హంతకుడిని కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూప ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ వేగవంతం చేసి, అతన్ని ఉరి తీయాలన్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా చిన్నారులు, మహిళలపై ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతుండటం బాధాకరమన్నారు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

సైదాపూర్: మండల కేంద్రంలోని వెన్కేపల్లి ఉన్నత పాఠశాలలో 2001–02 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు సోమవారం తమ స్కూల్ ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 22 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులను కలవడంతో భావోద్వేగానికి లోనయ్యారు. ఆప్యాయంగా పలకరించుకొని, క్షేమ సమాచారం తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, నవ్వుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అందరూ కలిసి భోజనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి సందడిగా గడిపారు.

ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న సూర్యకిరణ్

హుజూరాబాద్: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ కొలుగూరి సూర్యకిరణ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం అలుపెరుగని పోరాటాలు చేసి, తెచ్చుకున్న రాష్ట్రంలో గత ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. కొత్త ప్రభుత్వమైనా తగిన న్యాయం చేయాలని కోరారు. విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. నాయకులు దుర్గం బాలు, నాయిని జనార్దన్, మాతంగి ఆర్య, సాగర్, భువన్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



వైభవోపేతం.. నృసింహుని కల్యాణం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి గుట్టపై సోమవారం ఉగ్రనృసింహస్వామి కల్యాణాన్ని వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పంచామృతాభిషేకం, ఆరాధన పుణ్యవచనం, అఖండ దీపారాధన కార్యక్రమాలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, సత్యనారాయణ, నాగన్న, మురళీధరాచార్యులు, మాధవాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.